ప్రేమావేశంలో
ఊహల్లో తేలిపోయిన
ఆ బ్రహ్మచారికి
జరిగిన ఏక్సిడెంట్?

# ప్రేమలీల

బి. జగదీష్ చంద్ర కథ

సుబ్బారావుకు గాల్లో తేలుతున్నంత హాయిగా వుంది. నాలుగెప్పుడవుతుందా అని నిమిషానికోసారి గడియారంకేసి చూస్తున్నాడు.

నిజం చెప్పాలంటే సుబ్బారావు అసలు కథ ప్రారంభమైంది మధ్యాహ్నం భోజనం దగ్గర. పక్కింటి నిర్మల ఆంటీ వచ్చి -

''బాబూ ఈ రోజు సునీత నాన్నకు వంట్లో బాగా లేదట. సాయంత్రం యూనివర్శిటీకెళ్లి అమ్మాయిని పిలుచుకొస్తావా'' అనేటప్పటికే సుబ్బారావు డ్రీమ్‌లోకెళ్లిపోయాడు.

తన ఎన్నాళ్ల కల ఫలించబోతోంది! ఈసారి సునీతతో ఖచ్చితంగా తన ప్రేమ సంగతి చెప్పేయాలి. ఆ తర్వాత ఆమెను హీరోహోండాలో కూర్చోబెట్టుకుని...


''ఏంటి సుబ్బారావ్. ఏమంటావ్?'' నిర్మలమ్మ రెండోసారి అడిగేసరికి ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు సుబ్బారావు.

''అదెంత భాగ్యమండీ... అయినా మీరడిగితే కాదంటానా! నేను సాయంత్రం బేకార్‌గానే వుంటాను'' అనాలనుకున్నవాడు ఆఖరి క్షణంలో తమాయించుకుని ''సాయంత్రం ఎన్నింటికన్నారు?'' అనడిగాడు కాస్త సీరియస్‌గా మొహంపెట్టి.

''అయిదింటికి'' అందామె అనుమానంగా చూస్తూ.

సుబ్బారావు గడియారంకేసి చూశాడు. రెండయింది. కాస్త బిజీగా వున్నట్టు నటించకపోతే చులకనయ్యే ప్రమాదం లేదూ! ఆమెను కాస్త టెన్షన్‌లో వుంచుదామని ఏదో ఆలోచిస్తున్నట్టు గోడమీద బల్లికేసి చూడసాగాడు.

''ఏం బాబూ ఆలోచిస్తున్నావ్! కుదరదంటే వద్దులే పాపం... అవతలింటి కామేశంగాడిని



పురమాయిస్తాను'' అంటూ నిర్మలమ్మ కదలబోయింది.

గుండె గుభేల్లుమంది సుబ్బారావుకు. అసలే ఆ కామేశం సూదిలో దారంగాడు. ఆలస్యం చేస్తే కొంపలంటుకుపోతాయ్.

''అబ్బెబ్బే... అలాంటిదేం లేదండీ. వీ అమ్మాయిని లక్షణంగా ఇంటికి పిలుచుకొచ్చే పూ నాది'' అనేశాడు గబగబా.

అది మొదలు ఒళ్లంతా చెక్కిలిగింతలు పెట్టినట్టుంది సుబ్బారావుకు. తను సునీతతో ఐ లవ్‌యూ అని చెప్పడమూ, ఆమె సంభ్రమాశ్చర్యాలతో ఆనందభాష్పాలు కారుస్తూ తన కౌగిలిలో కరిగిపోవడమూ... తర్వాత యూనివర్శిటీ గ్రౌండ్స్‌లో ఓ ఐదు నిమిషాలు డ్యుయెట్ పాడుకుని ... అబ్బబ్బ... అసలు తల్చుకుంటేనే ఇంత ఇదిగా వుందే నిజంగా అయితే ఎంత అదిగా వుంటుందో!!

టింగ్ టింగ్‌మని గోడగడియారం నాలుగు గంటలు కొట్టడంతోనే చంగ్‌చంగ్‌మని లేడిలా బాత్‌రూమ్‌వైపు పరుగెత్తాడు సుబ్బారావు. ''ఆరోగ్యం ఎక్కడవుందో అక్కడ వుంది లైఫ్‌బాయ్'' అని అడ్డంగా పాడుతూ ఒళ్లు రుద్దుకునే హడావుడిలో రెండుసార్లు జారిపడ్డాడుకూడా.

నిలువుటద్దం ముందు తల దువ్వుతూ వుంటే ''సుబ్బారావ్!!'' అని కోడి కూసిన శబ్దం వినిపించింది.

''కోడికూత!!!''

అంటే పరమేశంగాడన్నమాట. ఇప్పుడు దాపురించాడేమిటీ. ఒకపట్టాన వదిలి చావడు వెధవ.

''ఒరేయ్ సుబ్బారావ్!'' లోపలకు రానే వచ్చాడు పరమేశం.

''ఏమిట్రా ఆ అరుపు. కాస్త నెమ్మదిగా పిలవలేవూ'' విసుక్కున్నాడు సుబ్బారావు.

''సర్లేగాని... తొందరగా తెములు... అవతల టైమైపోతోంది''

గుండెల్లో రాయి పడ్డట్టయింది సుబ్బారావుకు. సమయానికి తగలడ్డాడేమిటి చెప్మా.

''ఎక్కడికి?'' అడిగాడు.

''సిన్మాకి... అవతల థియేటర్ దగ్గర శేషీగాడు, సత్తిగాడు వెయిట్‌చేస్తున్నారు. నిన్ను తీసుకెళ్దామని నేనిటు వచ్చాను''

''నాకిప్పుడు కుదరదు. అయినా ఫస్ట్‌షోకి ఇప్పుడే బయల్దేరారేంట్రా!'' ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారావు.

''మా నాయనే వెళ్లేది ఫస్ట్‌షోకనుకుంటున్నావా. అవతల బొమ్మ ఎవరిదనుకున్నావ్! మెగాస్టార్‌ది!! ఇప్పుడెళితేగాని సెకండ్‌షోకి టిక్కట్లు దొరకవు... నువ్వు కదలమంటుంటే...'' తొందరచేశాడు పరమేశం.

''నాకు కుదర్దని చెప్పా కదరా. అర్జంట్ పనుంది. వెళ్లాలి''

''ఏం పని?''

చిర్రెత్తుకొచ్చింది సుబ్బారావుకు. అయినా ఓపిగ్గా చెప్పాడు.

''అరుణా కాంప్లెక్స్‌లో ఒకర్ని కలవాలి''

''అది అటువేపేగా వుండేది. నీ పనేదో చూస్కునే సినిమాకు వెళ్దాంలే''

తిక్కరేగింది సుబ్బారావుకు. ''ఒరేయ్, నీకు ఒకసారి చెబితే అర్థంకాదా. నాకివాళ కుదరదంటే కుదరదంతే''

''అబ్బబ్బ... ఎప్పుడూ ఏదో ఒక సాకు చెబుతావు. ఇవాళ నువ్వు కదలాల్సిందే'' పట్టువదలని విక్రమార్కుడిలా అన్నాడు పరమేశం.

ఏడుపొచ్చింది సుబ్బారావుకు ''ఒరేయ్ నీకు ఎక్కడ దండం పెట్టమంటే అక్కడ పెడతాన్రా. నువ్వేం చెయ్యమంటే అది చేస్తాను. నువ్వెక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాను. ఈసారికి నన్నొదిలిపెట్టరా తండ్రీ... ఏడుపుమొహంతో కన్నీళ్ల పర్యంతమై దీనంగా అడుక్కున్నాడు సుబ్బారావు.

పరమేశంగాడికి అయ్యో పాపం అనిపించింది. చిన్న పిల్లాడిలా బుంగమూతి పెట్టి, ''సర్లేరా... నీ ఇష్టం. అయితే నన్ను థియేటర్ దగ్గర డ్రాప్ చేసి వెళ్లాలి మరి'' అన్నాడు. గుండెలమీద కొండంత

భారం దిగినట్టయింది సుబ్బారావుకు.

థియేటర్ దగ్గర పరమేశాన్ని డ్రాప్ చేసేసరికి, ఏది వేసినా రాలనంత జనం వున్నారక్కడ.

''ఇక నేను వస్తాన్రా'' అన్నాడు సుబ్బారావు ఆత్రంగా. అతవల సునీతను పికప్ చేస్కోవడం లేటయితే కష్టం, ఇంప్రెషన్ కాస్త పోగొట్టుకోవాల్సివస్తుంది.

''ఉండరా బాబూ... ఈ వెధవలు ఎటు చచ్చారో ఏమిటో, చూస్తుంటే లోపలికి చెక్కేసినట్టున్నారు. మరి నన్నేం చెయ్యమంటావ్?'' కంగారుగా అడిగాడు పరమేశం.

''నువ్వేం చెయ్యాలో నన్నడుగుతావేంట్రా దరిద్రుడా. నీకు పుణ్యవుంటుంది. నన్నొదులు...'' చిరాగ్గా అంటూ బైక్ స్టార్ట్ చేశాడు సుబ్బారావ్. కాని పరమేశం అంత ఈజీగా వదిలేలా కనిపించలేదు.

''ఏమిటో.. టికెట్లెలాగూ దొరికేట్టు లేవు. నన్ను మా ఇంటిదాకా డ్రాప్ చెయ్యరా బాబూ...''

మళ్లీ ఏడుపొచ్చేసింది సుబ్బారావుకు. ఏం చెయ్యాలో తోచలేదు.


''ఓమాట'' అని నెమ్మదిగా పరమేశం చెవి దగ్గరకెళ్లి ''యాహూ'' అని భూమ్యాకాశాలు దద్దరిల్లిపోయేలా భయంకరంగా అరిచాడు.

అంతే... ఓ క్షణం అంతా నిశ్శబ్దంగా అనిపించింది. మరుక్షణం ప్రపంచవే తలక్రిందులైనట్టనిపించింది. వెంటనే మతి చలించినవాడిలా ఓ నవ్వు నవ్వి దభీమని కిందపడ్డాడు.

ఇప్పుడు యూనివర్శిటీ రోడ్డులో ఎనభై కిలోమీటర్ల స్పీడుతో వెళ్తున్నాడు సుబ్బారావు. ఒళ్లంతా గాల్లో తేలిపోతున్న అనుభూతి. అసలు సునీత ఏమంటుందో! తనే ముందు పలకరిస్తుందా! ఏవో... చూసీ చూడనట్టు వెళ్లిపోతే! ఎక్కడికెళ్తుంది... ఎటుతిరిగి తను పిలుచుకురావాల్సిందే! తను ప్రేమిస్తున్నట్టు దార్లో చెప్పేస్తే సరిపోతుంది.

ఆ సంగతి తలచుకోగానే ఒళ్లంతా ఒక్కసారి ఝుమ్మనిపించింది సుబ్బారావుకు.

ఛీ... ఛీ... దేబెలా మొహంపెట్టి ఒట్టి చేతుల్తో అలా అంటే చండాలంగా వుంటుందేమో! ఏ గులాబి పువ్వో, ఏ అమూల్ మిల్క్ చాక్లేటో ప్రజెంట్ చేస్తూ ఏం చెప్పినా బావుంటుంది.



ఆ అయిడియా రాగానే పూలదుకాణంలో ముద్దుగా వున్న ఓ గులాబి పువ్వును కొన్నాడు సుబ్బారావు. కానీ బేకరీలో మిల్క్ చాక్లేట్ కొంటూ వుంటే ఒక భయంకరమైన డౌటొచ్చింది.

''మరీ చిన్నపిల్లల్లా ఈ చాక్లెట్లేమిటండీ బాబూ'' అని సునీత చులకన చేస్తే... అమ్మో ఇంప్రెషన్ దెబ్బతినదూ? ఏమీ తెలియని దద్దమ్మ అనుకుంటే మొదటికే మోసం వస్తుంది. ఓ మాట షాపువాణ్ణి అడిగి చూస్తే బావుటుందేమో!

అటూ ఇటూ చూసి, సార్ నేనొకటి అడుగుతాను మీరేమనుకోరుగదా'' అడిగాడు సుబ్బారావు.

షాపువాడు గతుక్కుమన్నాడు ''ఏంటండీ బాబూ?''

''మరేం లేదండీ.. ఇప్పుడు మీకొక గర్ల్‌ఫ్రెండ్ వుందనుకోండి. అర్థమైందికదా. అర్థమయ్యే వుంటుందిలెండి. ఆ అమ్మాయికి మిల్క్ చాక్లేట్ ఇచ్చాననుకోండి. బావుంటుందాండీ?''

''అసహ్యంగా వుంటుందండి! నా గర్ల్‌ఫ్రెండ్‌కు మీరు చాక్లెట్ ఇవ్వడమేమిటండీ చండాలంగా'' షాపువాడు చికాగ్గా అన్నాడు.

''అబ్బే నా ఉద్దేశం అదికాదండీ''

''ఏదీ కాదండీ?'' షాపువాడికి తల వాచిపోతోంది. పిచ్చి కన్‌ఫ్యూషన్‌లో పడిపోయాడు సుబ్బారావు.

''నే చెప్పదల్చుకున్నదేమిటంటే... నా గర్ల్‌ఫ్రెండ్‌కు అదే మీ గర్ల్‌ఫ్రెండని మీరనుకున్నారు చూడండీ ఆ అమ్మాయి నిజంగా నా గర్ల్‌ఫ్రెండ్ కాదన్నమాట. అలాంటప్పుడు నేను... కాదు మీరు... అవును నేనే చాక్లెట్ ఇవ్వడమన్నమాట'' లాజిక్ చాలా సింపుల్‌గా వుంది. ఇంకా అర్థంకాలేదా అన్నట్టు షాపువాడికేసి చూసిన సుబ్బారావు గుండెలు జారిపోయాయి.

షాపువాడి మెడకాయమీద తలకాయ బొంగరంలా గిర్రుమని తిరుగుతోంది.

ఒక్క అంగలో బయటకు జంప్‌చేసి బైక్ స్టార్ట్ చేశాడు సుబ్బారావు. కొద్ది దూరం వెళ్లాకగాని అతడి మనసు కుదుటపడలేదు.

''హమ్మయ్య... ఏంటో ఈరోజు అన్నీ వింతగా జరుగుతున్నాయి...'' అనుకుంటుండగానే బైక్ ఆగిపోయింది. సుబ్బారావు తలక్రిందులైతపస్సు చేసినా తగ్గేది లేదన్నట్టు మొండికేసింది బైక్. అంతకుముందురోజే పెట్రోలుకూడా కొట్టించాడు. ప్రాబ్లెం అర్థంగాక ఏడుపు మొహంతో పిచ్చిగా తల బాదుకున్నాడు సుబ్బారావు.

అక్కణ్ణించి ఓ కిలోమీటర్ నెట్టుకుంటూ వెళ్లేసరికి ఓ గేరేజ్ కనిపించింది. అంతా సరిపోతుందని ఉత్సాహంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

కాళ్లు మాత్రం బయటకు కనిపించేలా వుంచి, కారుకింద పడుకుని ఓ మెకానిక్ రిపేర్ చేస్తూ కనిపించాడు.

''మెకానిక్‌గారూ!''

''... .... ...''

''మెకానిక్‌గారూ'' ఈసారి కాస్త గట్టిగా అరిచాడు సుబ్బారావు.

''.. ... ...''

''మెకానిక్‌గారూ!!'' ఇక లాభం లేదనుకుని గాడిద అరుపు అరిచాడు.

''... ...''

ఎంత అరిచినా జవాబు రాకపోయేసరికి తిక్కరేగింది సుబ్బారావుకు. బయటికి కనిపిస్తున్న ఆ రెండు కాళ్లను పట్టుకుని బరబరా ఇవతలికి లాగాడు. లబోదిబోమంటూ బయటకొచ్చి పడ్డాడు ఆ మెకానిక్.

''ఎన్నిసార్లు అరవాలి. తొందరగా బైక్ రిపేర్

చెయ్'' మీదపడి కొట్టినంత పనిచేశాడు సుబ్బారావు.

''మీది చాయ్ తాగి రండి సాబ్. నాది రిపేర్ చేసి పెడ్తా'' తాపీగా అన్నాడు మెకానిక్.

''అంత టైం నాకు లేదుగానీ నువ్వర్జంటుగా ఈ సంగతి చూడు'' విసుగ్గా అన్నాడు సుబ్బారావు.

''అదెంత సేపు సాబ్. ఐదు నిమిషాల్లో రిపేర్ చేసి పడేస్తాను.

మీది వెళ్లి చాయ్ తాగి రండీ''

మెకానిక్‌ని వంగోబెట్టి పిడిగుద్దులు గుద్దాలనిపించింది సుబ్బారావుకు.

ఒకవైపు లేటయిపోతోంటే తన ప్రాణానికి వీడెక్కడ దొరికాడురా దేవుడా అనుకుంటూ.

''నీకోసారి చెబితే అర్థంకాదా!!'' అని అరిచాడు కోపంగా.

అర్థమయిందన్నట్టు తలూపి మెకానిక్ అన్నాడు.

''మీది టెన్షన్‌లోకి ఎందుకు వస్తారు సాబ్. మీది ప్రాబ్లెమ్ మాకి సమజ్ అయింది. మాది వుండేదే మీకి రిపేర్ చెయ్యడాన్కి. మీకి ఫికర్ వాకి వదిలిపెట్టి ఛాయ్ తాగిరండి సాబ్. అర్రే ఖాసీం... సాబ్‌కే లియే ఏక్ స్పెషల్ ఛాయ్ బనానా భాయ్...''

నీరసపడిపోయాడు సుబ్బారావు. ఇదేదో కమిషన్ వ్యవహారంలా వుంది. తను టీ తాగొచ్చేవరకూ వీడు రిపేర్ చేసేలా లేడనుకుని రోడ్డుకవతల వున్న టీకొట్టువైపు కదిలాడు.

చక్కెర పాకంలా వున్న స్పెషల్ ఛాయ్‌ని ఎడారిలో నీళ్లు దొరికినవాడిలా గటగటా తాగి ఇవతలికొచ్చేసరికి తన బైక్ కనిపించలేదు. అటూ ఇటూ చూసేసరికి నేలమీద నెంబర్‌ప్లేట్ కనిపించింది.

ఓ క్షణం స్టన్నయ్యాడు సుబ్బారావు. అది తన నెంబర్ ప్లేటే! పక్కనే ఇంజన్‌పార్ట్, ఫ్రంట్‌వీల్, రియర్ వీల్, సీట్, హెడ్‌లైట్, మిగతా భాగాలన్నీ వరుసగా పేర్చబడి వున్నాయి.

జరిగింది అర్థమయ్యీ అర్థమవనట్టుంది సుబ్బారావుకు. మెకానిక్ కోసం చూస్తే మళ్లీ కారుకింద రిపేర్ చేస్తూ కనిపించాడు. కోపం నసాళానికెక్కింది. ''ఒరేయ్!'' అని అరుస్తూ సినిమాలోలా స్లోమోషన్‌లో పరుగెత్తుకెళ్లి కాళ్లు పట్టుకుని బయటికి లాగాడు.

''అసలేంటిది?'' గట్టిగా అడగాలనుకున్న

## సర్దుడు

''మొన్నొకసారి నువ్వు మా ఇంటికొచ్చినప్పుడు భార్యాభర్తల మధ్య గొడవలొస్తే ఎవరో ఒకరు సర్దుకుపోవాలి అన్నావుకదా''

''అవును ఇప్పుడేమైంది?''

''నిన్న మా ఇద్దరిమధ్యా గొడవొస్తే, మా ఆవిడ సూట్‌కేస్ సర్దుకుని పుట్టింటికి వెళ్లిపోయింది''

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు (గౌతంనగర్)



వాడు ఒక్క క్షణం ఆగి ఏమనుకున్నాడో ఏమో, ''బాబూ మెకానిక్‌గారూ... నా బైక్‌ని అలా పార్టుకి పార్టు వూడబెరికి అలా వరుసగా పేర్చిన కారణం అడగవచ్చునా'' నెమ్మదిగా అడిగాడు వస్తున్న ఏడుపు ఆపుకుంటూ.

''మాఫ్ చెయ్యాలి సాబ్. మర్చిపోయాను. మీధి బైక్ అంతా విప్పిన తర్వాత నాకు గుర్తుకొచ్చింది సాబ్, నేను బైకు మెకానిక్ కాదు. కారు మెకానిక్ అని. అది ఎలా ఫిట్టింగ్ చెయ్యాలో నాకీ సమజ్‌మే లేదు సాబ్. మీద ఫికర్ చెయ్యొద్దు సాబ్. ''మోటార్ సైకిల్ రిపేర్ ఎలా చెయ్యాలి?'' బుక్ నాది ఇంట్లో వుంది సాబ్. రేపు దాన్ని చూసి మీకు ఫిట్టింగ్ చేస్తా సాబ్!''

వెందడంతా మొుద్దుబరినట్టుంది సుబ్బారావుకు.

వాచ్‌వంక చూశాడు. ఆరుగంటలు కావస్తోంది. గ్యారేజ్ బయట యమహా పార్క్ చేసి కనిపించింది.

''అదెవరిది?'' అడిగాడు.

''నాది సాబ్''

తాపీగా వెళ్లి స్టాండ్ తీసి కిక్ కొట్టాడు. స్టార్ట్ కాలేదు. మళ్లీ మళ్లీ కిక్ కొట్టాడు. లాభం లేకపోయింది.

''దాంట్లో ఒక్క చుక్క పెట్రోలు లేదు సాబ్'' పళ్లికిలించాడు మెకానిక్.

మౌనంగా ఒక్క క్షణం ఆకాశంకేసి చూశాడు సుబ్బారావు. వెంటనే ఓ మూల పడివున్న ఖాళీ డబ్బాతో వెళ్లి రోడ్డు పక్కనున్న బోరింగ్ పంప్‌లో నీళ్లు పట్టుకొచ్చి పెట్రోల్ ట్యాంక్ నిండా పోశాడు.

సుబ్బారావు చర్యలకి కళ్లు బైర్లు కమ్మాయి మెకానిక్‌కి. ఒకే ఒక్క కిక్! బర్రుమంటూ బైక్ స్టార్ట్ అయింది.

అంతే...

ఆ మెకానిక్ కోమాలోకి వెళ్లిపోయాడు.

ఇప్పుడు చాలా హాయిగా వుంది సుబ్బారావుకు.

సాయంత్రం చల్లటి గాలికి మనసంతా మళ్లీ ఆహ్లాదంగా మారిపోయింది. దూరంలో యూనివర్శిటీ బిల్డింగ్ మసక మసకగా కనిపిస్తోంది. ఎవరూ రాలేదేమిటని సునీత గాబరా పడుతుందేమో! ఇంకెంతసేపు, ఇంకొన్ని క్షణాల్లో తను అక్కడుంటాడు. ఈ ప్రైవసీ మళ్లీ తనకు దొరకదు. ఈ ఛాన్స్‌మిస్సవకుండా తన ప్రేమను వ్యక్తం చేయాలి...

ఇలా సాగిపోతున్నాయి సుబ్బారావు ఆలోచనలు.

ఎదురుగా ఓ కారు వస్తూ కనిపించింది. ఎందుకో ఆ కారు కంట్రోల్ తప్పుతున్నట్టు అనిపించింది సుబ్బారావుకు. స్పీడు తగ్గించి సైడు తీసుకున్నాడు. తీరా దగ్గరికొచ్చాక సడెన్‌గా రైట్‌కు టర్నయి బైక్‌ని గుద్దేసింది కారు. అల్లంత దూరంలో వెళ్లి పడ్డాడు సుబ్బారావు.

మోచేతులు గీరుకుపోయాయి. బోర్లా పడడంవల్ల కణతకు దెబ్బ తగిలి రక్తం వచ్చింది. అంతలో కార్లో వున్న ఇద్దరు హడావుడిగా దిగి వచ్చారు. అటు చూసిన సుబ్బారావుకు ఆశ్చర్యంతో నోరు పెగల్లేదు.

'సునీత!

సునీత!!

సునీత!!!

పక్కన ఎవరో అబ్బాయి వున్నాడు. సుబ్బారావుని చూస్తూనే ఆ అమ్మాయి స్టన్నయింది. వెంటనే తేరుకుని,

''సారీ సుబ్బారావుగారూ! అనుకోకుండా అలా జరిగిపోయింది. అనిల్ వద్దని వారించినా నేనే డ్రైవింగ్ తీసుకున్నాను. పెద్దగా దెబ్బలేం తగల్లేదుకదా... థ్యాంక్ గాడ్! అసలేం జరిగిందంటే ఈ రోజు మా నాన్నగారు రాలేదు. సరే అని అనిల్ కార్లో ఇంటికెళుతూ ఇలా...'' అని నసిగింది.

''దాందేం వుందండీ... ఆక్సిడెంట్లన్నాక జరుగుతూనే వుంటాయ్'' షర్టు దుమ్ము దులుపుకుంటూ వెర్రి నవ్వు నవ్వాడు సుబ్బారావు.

ఒకరికొకర్ని పరిచయం చేసింది సునీత.

''ఈయన సుబ్బారావుగారని మా పక్కింట్లో వుంటారు. ఈయన అనిల్... నా క్లాస్‌మేట్ కమ్ ఫియాన్సీ...''

ఒక్క క్షణం గుండె ఆగి మరీ కొట్టుకుంది సుబ్బారావుకు. మెదడంతా బ్లాంక్ అయినట్లు అనిపించింది.


''సరే సుబ్బారావుగారూ... మేమూ వెళ్లొస్తాం. అనిల్ విషయం ఇంట్లో చెప్పకండి ప్లీజ్... తర్వాత నేనే మా వాళ్లను సర్‌ప్రైజ్ చేద్దామనుకుంటున్నాను'' అంది సునీత.

మౌనంగా తల ఊపాడు సుబ్బారావు. రక్తం ఎక్కువ బ్లీడ్ కాకుండా కణతకు కర్చీఫ్ అడ్డం పెట్టుకున్నాడు. ప్రతిదానికి ఏడుపు వచ్చినట్టుగా అనిపించే సుబ్బారావుకు ఈసారెందుకో ఏడుపు రాలేదు. అంతా భయంకరమైన నిశ్శబ్దంగా తోచింది. ఎక్కడో చదివిన శాయరీ లీలగా గుర్తొచ్చింది.

''తక్‌దీర్ బనానేవాలే తునే కమీన కీ
కిసే క్యా మిలా ఏతో ముకద్దర్‌కీ బాత్ హై!''

కారు వెళ్తున్నవైపు చూస్తూ అలాగే నిలబడ్డాడు సుబ్బారావు. నలిగిన గులాబీ రోడ్డుమీద పడి వుంది.

## ఒకే గుండె కవలలు



యాంజెలా, యాన్నే అనే ఇద్దరు సయామిస్ ఆడ కవల పిల్లలకు ఒకే గుండె, ఒకే కాలేయం వున్నాయి. వీళ్లిద్దరినీ ఆపరేషన్ చేసి విడదీయకపోతే హార్ట్ ఫెయిల్యూర్ అయి ఇద్దరూ మరణించే అవకాశం వుందని డాక్టర్లు చెప్పారు. ఒకవేళ విడదీస్తే ఒకరు తప్పనిసరిగా మరణిస్తారు. మరొకరికి బ్రతికే అవకాశం ఒక్క శాతమే వుందని చెప్పారు. ఆరుగంటల ఆపరేషన్ అనంతరం యాన్నే మరణించింది. యాంజెల్లా బ్రతికింది.